# 9. అంతా మన మేలుకే!

కేశవరావు రాకతో ఆ పల్లెటూరిలో పెద్దమార్పు వచ్చింది. మొదట అందరూ అతన్ని గొప్పగా చూశారు. కాని, అతను అంత గొప్పవాడు కావటం, తాము తక్కువవాళ్ళు కావటమేననే సత్యాన్ని గ్రహించేందుకు వాళ్ళకు ఎక్కువ కాలం పట్టలేదు.

కేశవరావు ఆ గ్రామానికి మొట్టమొదటి గ్రాడ్యుయేటు. ఒక్క చదువులోనే అతను అధికుడైనట్టయితే ఇంత గందరగోళం జరిగేది కాదు. చదువుకుతోడు నవనాగరికతా, ఆధునిక యువకుల అభిప్రాయాల్నికూడా అతను తనవెంట తీసుకొచ్చుకున్నాడు. తీసుకొచ్చినవాడు తన యీ ఆస్తిపాస్తుల్ని గుప్తంగా ఉంచుకొన్నా సరిపొయ్యేది. వాటిని ప్రదర్శిస్తూండటంవల్ల ఇతరుల కందరికీ కంటకప్రాయుడయ్యాడని చెప్పక తప్పదు.

'అందరూ' అనే పైన శబ్దంలో పొరపాటు వున్నదనిపిస్తోంది. ఎందుకంటే ఆ గ్రామ యువకులు కూడా మొదట్లో కేశవరావును యీర్ష్యతో చూశారు కాని, తరువాత తరువాత అతన్ని అనుకరించాలని ప్రయత్నించారు. అతని అభిప్రాయాల్ని జీర్ణించుకోవటమూ, అతని నాగరికతను చేతనైనంతవరకూ అలవర్చుకోవటమూ, అతని సంస్కారాన్ని మెచ్చుకుంటూ ఇతరుల దగ్గర ప్రదర్శించజూపటమూ మొదలైనవి చేయసాగారు. అంటే అనుకరించటం అతన్ని మెచ్చుకోవడమే అవుతుంది. కనుక- యువకులందరికీ కేశవరావు ఒక మోడల్‌గా అతి ఇష్టుడుగా తయారయ్యాడు.

కాని గ్రామపెద్దలూ, వయసు మళ్ళినవాళ్ళు మాత్రం అతన్ని మెచ్చుకోలేదు. అంతేగాక అతనంటే గొప్ప అయిష్టతను చూపసాగారు. వాడు చెడటమేకాక, తమ పిల్లల్ని కూడా పాడుచేస్తున్నాడనే వారి అభిప్రాయం వారికి మరింత కోపకారణమైంది. తమ బంగారం మంచిదికాదనే మాట వారికితట్టలేదు. అసలు ఇది చెడిపోవటమా కాదా అనే తర్కం వారికి అనవసరమైంది. నగ్నసత్యమని తెలిసిన విషయానికి తర్కం దేనికని వారి నమ్మకమై వుంటుంది.

మరీ కేశవరావు సంఘసంస్కారాభిలాష గ్రామపెద్దలకు పడలేదు. కూలిజనంలో పాతుకుపోవటమూ, గుడ్డకూ తిండికీ చాలని వాళ్ళ కూలిని హెచ్చించమని ప్రచారం చేయటమూ, అట్లా చేయనిపక్షంలో సమ్మె చేయిస్తానని బెదిరించటమూ ఇదంతా గ్రామపెద్దల దృష్టిలో ఒకరకం దోపిడీవిధానమనిపించింది! వారికి లోపల ఎంత

కోపంవున్నా దాన్నంతా తొక్కిపట్టి కేశవరావును మంచి మాటలతో మళ్ళించాలని చూశారు. కాని అదేమీ లాభం లేకపోయింది. భయపెట్టి చూశారు, అంతకన్నా లాభం లేకపోయింది. వారికి దిక్కుతోచలేదు.

ఒకనాడు గ్రామపెద్దలంతా సమావేశమయ్యారు.

"వీడు రాకపూర్వం గ్రామంలో ఇంత కల్లోలం లేదు. ఇప్పుడు మన పిల్లల్ని చెడగొట్టటమేకాక, కూలిజనాన్ని మన మీదికి తోలాలని ప్రయత్నిస్తున్నాడు. ఏంచేసేట్టు?" ఇదీ వారినీనాడు ఎదుర్కొన్న సమస్య.

"వీణ్ని తంతే?"

"కూలాళ్ళందరూ మన ఎముకలు సున్నంలోకి లేకుండా చేస్తారు."

"అసలు వీడు తెలివిగలవాడే ననుకుందాం. బాగా చదువుకున్నవాడే. అన్ని గుణాలూ ఉండి యీ వూళ్ళో యీ మారుమూల పడివుంటే వీడికీర్తి దూరదూరాలకు ఎట్లా పాకుతుంది? వీడు ఏ పట్టణానికన్నా పోయి తన సంస్కరణను అక్కడ వెలగబెట్టరాదూ?"

"పట్టణాల్లో వీడిలాంటివాళ్ళు కొల్లలు. అక్కడ వీడి మొహం ఎవరు చూస్తారూ? ఇక్కడైతే – మనలాటి చదువులేని దద్దమ్మల దగ్గరైతే గొప్పగా బతకొచ్చు."

"ఏ ఉద్యోగమన్నా చేసుకోక, యీ సంఘసంస్కరణ వీడికెందుకంట?"

"ఉద్యోగాభిలాష వాడికిలేదట, తినికూర్చుంటే తోచక యీ రకంగా పలుకుబడి ఏడుద్దామనుకుంటున్నాడేమో!"

"ఇంతకూ వీడితో ఎట్లాగంట?"

"వీణ్ని కాంగ్రెస్‌వాడంటే?"

అప్పటిది బ్రిటిష్ ప్రభుత్వం కనుక యీ ప్లేటు పనిచేసే అవకాశం వుంది.

"ఎట్లా? ప్రభుత్వం నమ్మవద్దూ?"

"ఇప్పటినుంచే మనం యీ రకం ప్రచారంకనుక చేస్తే కొన్నాళ్ళకైనా వాళ్లు నమ్మి వీణ్ణి జైలుకు పంపుతారు. అట్లా కాని మనకు వీడి పీడవదలదు."

ఇంతకన్నా ఇంకోమార్గం లేకపోవటంవల్ల గ్రామపెద్దలందరూ ఏకీభవించిన విషయాల్లో ఇదే మొదటిది.

కాని వారనుకున్నంత తేలిగ్గా అంత స్వల్పకాలంలో కేశవరావు కాంగ్రెస్ వాడనే నమ్మకం ప్రభుత్వానికి కలిగించలేకపొయ్యారు. ఏదన్నా సమయం దొరుకుతుందా లేదానని వారందరూ తమతమ కులదైవాల్ని ప్రార్థిస్తూ కూర్చున్నారు.

ఇంతలో 1942 అల్లర్లు సాగినవి. అప్పుడు ఆ గ్రామమంతా ప్రశాంతంగా వుంది. ఇదే సమయంలో గ్రామపెద్దల్లో తెలివిగలవాడు ఒక పన్నాగం పన్నాడు...

గ్రామపెద్దలే స్వయంగా వెళ్ళి రైలు పట్టాల్ని తొలగించేశారు. ఆ నేరాన్ని కేశవరావుకు అంటగట్టారు. అంతకుముందు నాలుగు నెలలుగా కేశవరావు కాంగ్రెస్‌వాడని ప్రభుత్వానికి వారుపెడుతూవొచ్చిన మహజర్లు యీ విషయంలో బాగా పనిచేసినవి.

కేశవరావు మీద పెట్టబడ్డకేసు ఇట్టే రుజూ ఐంది. ఆస్తిపరులైన పెద్దమనుషులనబడేవాళ్ళంతా కలిసి ఆడిన అబద్ధానికి, బీదవాడు చెప్పేనిజంకన్నా వెయ్యిరెట్లు విలువ లోకంలో ఎప్పుడూ తగ్గకుండా వుంటుందిగా!

ఆరునెలలు కారాగారవాసాన్ని అనుభవించటంతో కేశవరావు గ్రామపెద్దలు భావించినట్టు దిగజారిపోయి కుంగిపోలేదు. జైల్లో అతనిపట్టుదల, కార్యదీక్ష అభివృద్ధి చెందింది.

అంతేకాని కాంగ్రెస్‌పేరుతో తనకు చుట్టబడ్డ యీ జైలువాసం వల్ల అతనికి కాంగ్రెస్ అంటే సానుభూతీ, అభిమానమూ ఏర్పడలేదు. ఎందుకనంటే దేశంలోని మూర్ఖుల్లో అతనికి చోటు లేదు!

అతని గ్రామీణ కార్యక్రమంలో మార్పేమీ లేదు. గ్రామ పెద్దలకు ఇంకో సమయంకూడా చిక్కే సూచనలు కనుచూపుమేరలో లేవు. అసలు వీడు కనుక యం.ఎల్.ఎ ఎలక్షన్స్‌లో నిలబడితే తమ పునాదికే మోసంవస్తుందని వారు భయపడసాగారు.

కాని కేశవరావు ఆ పనిచేయలేదు. పదవీ వ్యామోహం అతనికి లేదు. అతను దేశసేవ చేద్దామనుకున్నాడు- అప్పటికి అంతే!

కాంగ్రెస్ ప్రభుత్వం వొచ్చినా తనకు కాంగ్రెస్‌వాడనే లేనిపోని పాడుపేరు దేశమంతా వున్నా అతను మంత్రుల చుట్టూ పర్మిట్లకోసం తిరుగులాడలేదు. యీ సమయంలోనే గ్రామపెద్దలు వీణ్ని కమ్యూనిష్టు అని ప్రచారంచేసి చూశారుకాని, పాతరికార్డుల్ని బట్టి ప్రభుత్వం కేశవరావు వెంట్రుకను కూడా కదల్చలేకపోయింది.

ఒకనాడు కేశవరావుకు ఒక పెద్ద కవరు దిగింది. రాజకీయ బాధితులందరూ పంచుకుంటూన్న ఐదేసి ఎకరాల భూముల్లో తనకుకూడా ఒక ప్లాటు ఇవ్వబడ్డది. యీ సంగతి తెలిసిన గ్రామపెద్దలందరూ- రైలుపట్టాలుపీకిన తమకేమీ రాకపోవటంవల్ల ఎంతో విచారపడ్డారు. ఒక్కో ఎకరానికి ఒక్కో సంవత్సరంపాటు జైలువాసం చేసేందుకు సిద్ధమైనా తమ మొహం చూచేవాళ్ళు లేకపోవటం వారికి ఎంతో కష్టమని పించింది. యీసారి ఎలక్షన్స్‌లో తమకు ఐదేసి ఎకరాలు ముందుగా రిజర్వ్ చేసుకుంటేనేకాని ఓట్లుపడవని ఖచ్చితమైన ప్రమాణాలు చేసుకుందామని వారింకా ఆలోచిస్తున్నట్లు వార్తలు నలువైపులా వ్యాపించినవి!

– సెప్టెంబరు, *1948*